ప్లాస్టిక్ నిషేధం.. కాగితాలకే పరిమితం

- విచ్చలవిడిగా పాలిథిన్ వాడకం
- అవగాహనతోనే సరిపెడుతున్న వైనం
- చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం విఫలం..



ముంచంగిపుట్టు వారపు సంతలో ప్లాస్టిక్ వ్యర్థాలు

ముంచంగిపుట్టు: ప్లాస్టిక్ వినియోగం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నా ప్రజల్లో చలనం లేదు. ప్లాస్టిక్ వినియోగం భావితరాలకు పెనుముప్పుగా పరిణమించే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. తెల్లవారితే చాలు ఇంట్లోకి అవసరమైన సామగ్రి, వస్తువులు ప్లాస్టిక్ కవర్లతోనే ఇళ్లకు తీసుకువస్తున్నారు. దీంతో ఏ ఇళ్లు చూసిన ప్లాస్టిక్ కవర్లతో నిండిపోతోంది. వాటిని బయట పారేస్తే అవి మురుగుకాలువలు, రోడ్ల పక్క కుప్పలు తెప్పలుగా వచ్చి చేరుతున్నాయి.

విచ్చలవిడిగా పాలిథిన్ కవర్లు

ముంచంగిపుట్టు మండలంలో 23 పంచాయతీల్లో 372 గ్రామాలున్నాయి. ముంచంగిపుట్టు మండల కేంద్రంతో పాటు భూసిపుట్టు, లక్ష్మీపురం, బంగారుమెట్ట, జోలాపుట్టు వారపు సంతల్లోని దుకాణాల్లో విచ్చల విడిగా పాలిథిన్ కవర్ల వాడుతున్నారు. పాలిథిన్ కవర్ల వాడకం వల్ల అనేక అనర్థాలు దెబ్బతింటాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ వ్యాపారులు వాటిని పెడచెవిన పెడుతున్నారు. ఎక్కడికక్కడ ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, టీ గ్లాసులు, ప్లేట్లు, ప్యాకింగ్ కవర్లు లభ్యమవుతున్నాయి. దీనికి తోడు పక్కన ఉన్న ఒడిశా రాష్ట్రం నుంచి సైతం అధికంగా ప్లాస్టిక్ కవర్ల వారపు సంతలకు ఒడిశా వ్యాపారులు తీసుకొని వచ్చి అమ్మకాలు చేస్తున్నారు. అప్పడప్పుడు జిల్లా విజిలెన్స్ సభ్యులు వారపు సంతల్లో దాడులు చేసి పాలిథిన్ కవర్లు, గుట్కాలు వంటివి పట్టుకుంటూ జరిమానా విధిస్తున్నారు. మండల స్థాయి అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో ప్లాస్టిక్ కవర్ల వినియోగం రోజు రోజుకు పెరిగిపోతోంది. పరిసరాల పరిశుభ్రతపై ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛాంధ్ర ,స్వర్ణాంధ్ర కార్యక్రమం ఫోటోలకే పరిమితమవుతుంది. ప్లాస్టిక్ సంచులు, వస్తువుల విక్రయాలు జరపకూడదని వారపు సంతలతో పాటు మండల కేంద్రంలో వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేసినా ప్రయోజనం మాత్రం కనిపించలేదు. ప్లాస్టిక్ బదులు కాగితం కవర్లు, నార సంచులు వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు. అంతే కాకుండా ప్రతి మూడో శనివారం సచివాలయాల పరిధిలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా అవగాహన ర్యాలీలు నిర్వహించి పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ అనర్థాలపై సూచనలు చేస్తున్నప్పటికీ వ్యాపారులలో,ప్రజల్లో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అవగాహన కార్యక్రమాలతో పాటు ప్లాస్టిక్ వినియోగంపై జరిమానాలు వేస్తేనే ప్లాస్టిక్ కవర్ల వినియోగం నిషేధం అమలుకు ఆస్కారం ఉందని పలువురు వాపోతున్నారు.



జిల్లా విజిలెన్స్ సిబ్బంది స్వాధీనం చేసుకున్న పాలిథిన్ కవర్లు, గుట్కాలు



ముంచంగిపుట్టులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)



పెద్దపుట్టుకు వెళ్లే మార్గంలో పాలిథిన్ కవర్లు

ప్లాస్టిక్ నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత



ప్లాస్టిక్ వస్తువుల వాడకం ద్వారా క్యాన్సర్ సోకే అవకాశం ఉంది. ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని ప్రభుత్వం నిషేధించినప్పటికీ ప్రజల్లో చైతన్యం రాలేదు. మార్కెట్‌కు వెళ్తే ఇంటి నుంచి నార, కాగితం సంచులు వెంట తీసుకెళ్లడం ఉత్తమం. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలి.

–శిరీష, వైద్యాధికారి, కిలగాడ పీహెచ్‌సీ

చర్యలు తీసుకుంటాం



ప్లాస్టిక్ వస్తువులు వాడకాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది.పర్యావరణ చట్టం ప్రకారం 50 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువులు వాడకూడదు. నేల, నీరు కలుషితమవుతాయి. ఫలితంగా అనేక అనర్థాలు తలెత్తుతున్నాయి. ప్లాస్టిక్ వినియోగంపై వారపు సంతల్లో, గ్రామాల్లో ర్యాలీలు,అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలలో చైతన్యపరుస్తున్నాం.ప్లాస్టిక్ నిషేధాన్ని అమలుచేయని వారిపై చర్యలు తీసుకుంటాము.

సూర్యనారాయణమూర్తి, ఇన్‌చార్జి ఎంపీడీవో, ముంచంగిపుట్టు

క్లుప్తంగా

ముగిసిన క్రికెట్ టోర్నీ



బహుమతులు అందుకున్న జట్లు

ఎటపాక: మండలంలోని పట్టుచీర గ్రామంలో జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెలరోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నీలో నారాయణరావుపేట జట్టు విజేతగా నిలిచింది సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నారాయణరావుపేట జట్టు, బండారుగూడెం జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో నారాయణరావుపేట జట్టు విన్నర్‌గా, బండారుగూడెం జట్టు రన్నర్‌గా మిగిలింది. మొదటి బహుమతిగా రూ25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ15వేలను ట్రస్ట్ నిర్వాహకులు ఆయా టీమ్‌లకు అందజేశారు. నిర్వాహకులు, గ్రామస్తులు మధు, రమేష్, సీతయ్య, సత్యం, శ్రీను, రామకృష్ణ, రాము, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభం



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, సభ్యులు

చింతూరు: మండలంలోని పూంగుట్ట, పాత వినాయకపురం, ఆముదాలపేట గ్రామాల్లో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలను సమారిటన్స్ ఫర్ ది నేషన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పేగ సర్పంచ్ పాయం చంద్రయ్య మాట్లాడుతూ తల్లులు, చిన్నారుల ఆరోగ్యానికి కావాల్సిన పోషకాహారం, ప్రాథమిక విద్య అందేందుకు ఈ కేంద్రాలు దోహద పడతాయన్నారు. సంస్థ డైరెక్టర్ రామ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు



వి.ఆర్.పురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ప్రభుత్వ ఉన్నత, బాలికల ఆశ్రమ పాఠశాలలను కేంద్రాలుగా పరీక్షలకు కేటాయించారు. ఎస్ఐ కె. పాపినాయుడు పర్యవేక్షణలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు అధికారులు తెలిపారు.

వి.ఆర్.పురం: మండలంలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని సోములగూడెం, సున్నవారిగూడెంలలో రేఖపల్లి పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. టెన్త్ సప్లమెంటరీ పరీక్షల్లో తెలుగులో–22 మంది, హిందీలో–22, ఇంగ్లిష్–22, గణితం–126, సైన్స్–123 మంది, సోషల్ స్టడీస్–71 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్టు ఎంఈఓ–2 చిచ్చడి బాబురావు తెలిపారు.

ఎండీయూ ఆపరేటర్ల నిరసన



రంపచోడవరంలో నిరసన తెలుపుతున్న ఎండీయూ డ్రైవర్లు

రంపచోడవరం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన ఒప్పందం ప్రకారం 72 నెలలు పాటు (2027 సంవత్సరం) వరకు ఎండీయూ వాహనాల ఆపరేటర్లుగా తమను కొనసాగించాల్సి ఉంది ఎండీయూ ఆపరేటర్లు తెలిపారు. రంపచోడవరంలో సోమవారం ఎండీయూ ఆపరేటర్లు ర్యాలీ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కల్పశ్రీకు వినతిపత్రాన్ని అందజేశారు. కూటమి ప్రభుత్వం అర్ధంతరంగా ఎండీయూ వాహనాలను రద్దు చేయడం బాధాకరమన్నారు. ముందస్తు సమాచారం లేకుండా ఈ నిర్ణయం తీసుకోవడంతో ఎండీయూ ఆపరేటర్ల కుటంబాలు వీధిన పడే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరిగి తమ విధులను అప్పగించాలని కోరారు. లేని పక్షంలో ప్రత్యామ్నాయంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

6న మండల సమావేశం

కొయ్యూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వచ్చే నెల 6న ఎంపీపీ బడుగు రమేష్ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బి.డి.వి.ప్రసాద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో విధిగా సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు. ప్రజాప్రతినిధులు అందరికి సమాచారం ఇస్తామన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటాం

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటామని అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. సోమవారం మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన కొంతిలి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ నేపథ్యంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గ్రామస్తుడు వంతాల శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడు శ్రీనివాసరావు సంస్మరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మృతుడు శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. సర్పంచ్ రేగం రమేష్ తదితరులున్నారు.



శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

కళాశాలల్లో అందరికీ ప్రవేశాలు కల్పించాలి

పాడేరు రూరల్: కళాశాలల్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ ప్రవేశాలు కల్పించాలని ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతు గిరిజన గురుకులం కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులందరికి సీట్లు కేటాయించి ప్రవేశాలు కలిప్ంచాలన్నారు, సక్రమంగా ప్రవేశాలు కల్పించకపోతుండడంతో ఆదివాసీ విద్యార్థినులు చదువుకు దూరమతున్నారన్నారు. ప్రైవేట్ కళాశాల్లో ఫీజులు చెల్లించే ఆర్థిక స్తోమత లేక గిరిజన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీట్ల కోసం కళాశాలల్లో దరఖాస్తు చేస్తుకున్న విద్యార్థులకు ప్రవేశాలు కల్పించే విధంగా ప్రభుత్వం, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో విద్యార్థులతో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. నాయకుడు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నేతలు

యోగాతో ఆరోగ్యం



చింతపల్లి కళాశాలలో యోగా శిక్షణను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ విజయభారతి



యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న కో–ఆర్డినేటర్ సామిదాల శ్రీను

చింతపల్లి: యోగాసనాలతో ఆరోగ్యాన్ని పొందవచ్చని చింతపల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయభారతి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగతో మానసిక ఉల్లాసం, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. యోగసనాలు చేయడం ప్రతిఒక్కరూ దినచర్యలో భాగంగా అలవాటు చేసుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసపాత్రుడు, ఎన్ఎస్ఎస్ పీవో ఈశ్వర్, పూర్ణారావు, రవీంద్రబాబు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం ఏపీఎం భాస్కర్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ సామిదాల శ్రీను పాల్గొని యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. సంస్థ సీఐ ప్రశాంత్, వెలుగు సీసీలు, సిబ్బంది, మహిళా సంఘాలు పాల్గొని యోగపై శిక్షణ పొందారు.

గ్రామాల్లో ఆకట్టుకున్న తిరంగా యాత్ర



చవిటిదిబ్బలులో తిరంగా యాత్రలో బీజేపీ నేతలు



నెల్లిపాకలో తిరంగ ర్యాలీ

వై.రామవరం: ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై నియోజకవర్గ బీజేపీ నేత కారం సీతారామన్నదొర(ఢిల్లీబాబు) ఆధ్వర్యంలో మండలంలోని చవిటిదిబ్బలు గ్రామంలో సోమవారం తిరంగా ర్యాలీ యాత్ర నిర్వహించారు. పహెల్గామ్ ఉగ్రవాదుల దాడికి ప్రతి చర్యగా భారత సైనిక శక్తిని తెలియజేసిన సందర్భంగా ఈ విజయయాత్ర ర్యాలీ నిర్వహించినట్టు బీజేపీ నేతలు తెలిపారు. నాయకులు ఆదివిష్ణు, కొండలదొర, స్వప్నకుమారి, కృష్ణారెడ్డి, రామారావు, స్వామిరెడ్డి, సత్యవతి, పండురెడ్డి, సుబ్బారెడ్డి, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: ఆపరేషన్ సిందూర్ విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం నెల్లిపాకలో తిరంగ విజయయాత్ర ర్యాలీ నిర్వహించారు. సెంటర్ నుంచి బైపాస్ రహదారి వరకు జాతీయ జెండాలతో కూటమి నాయకులు ర్యాలీ చేశారు. పర్యాటకులపై ఉగ్రదాడులకు ప్రతీకారం జరిగిన ఆపరేషన్ సిందూర్‌తో భారత్ తన సైనిక శక్తిని ప్రపంచానికి చాటిందన్నారు. నాయకులు శ్యామ్‌ప్రసాద్, గంగాధర్, సతీష్‌కుమార్ నాయక్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటితో ప్రబలుతున్న రోగాలు

డుంబ్రిగుడ: పోతంగి పంచాయతీ పంతలచింత గ్రామంలో వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలతో బాధపడుతు ఓ గిరిజన మహిళ జమున అరకులోయ ఏరియా ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. గ్రామంలో కుళాయిలు, బావిలోని నీరు కలుషితంతోనే వాంతులు, విరేచనాలు అవుతున్నట్టు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.



చికిత్స పొందుతున్న గ్రామస్తురాలు జమున

జీసీసీ మేనేజర్‌గా సుగునాథం బాధ్యతల స్వీకరణ



జీసీసీ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుగనాథంనకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది

చింతపల్లి: చింతపల్లి గిరిజన సహకార సంఘం నూతన మేనేజర్‌గా చల్లంగి సుగునాథం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత రెండేళ్లుగా ఖాళీగా ఉన్నటువంటి బ్రాంచి మేనేజర్ పోస్టును డివిజన్ మేనేజర్ బాధ్యతలు నిర్వర్తించేవారు. ఇటీవల బదిలీల్లో భాగంగా పాడేరు డివిజన్ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న సుగునాథంనకు పదోన్నతి కల్పిస్తూ పూర్తి అదనపు బాధ్యతలతో మేనేజర్‌గా జీసీసీ ఎండీ ఉత్తర్వులు జారీ చేసింది.ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ఎంఎల్ఎస్ పాయింట్ సూపరింటెండెంట్ రమణమూర్తి, గ్యాస్ గొడౌన్ సూపరింటెండెంట్ రమణమూర్తి, సీనియర్ సేల్స్‌మెన్ శెట్టి చిన్నబ్బాయి, డీఈవో భారతి తదతరులు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు.

న్యాయ పోరాటాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

పాడేరు రూరల్: న్యాయ పోరాటలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం సాధ్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి పొటిక సత్యనారాయణ చెప్పారు. మండల కేంద్రంలోని ఆదివాసీ పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం కార్యాలయంలో సీపీఐ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయపరంగా శాంతిపోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పాడేరులో వచ్చే నెలలో నిర్వహించనున్న పార్టీ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల పార్టీ కార్యవర్గ ఎన్నిక జరిగింది. మండల కార్యదర్శిగా చంటిబాబు, సహాయ కార్యదర్శులుగా రత్నం, శివలతో పాటు తొమ్మిది మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ కార్యవర్గానికి పార్టీ సీనియర్ నాయకులు రాధాకృష్ణ, అమర్, రాజుబాబు, సింహాచలం తదితరులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

123 మందికి కంటి వైద్య పరీక్షలు

పెదబయలు: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వెంకటేశకవర పుష్పగిరి కంటి ఆస్పత్రి (విజయనగరం) ఆధ్వర్యంలో పెదబయలు పీహెచ్‌సీ ఆవరణలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 123 మందికి పరీక్షలు చేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్ తెలిపారు. శిబిరానికి వచ్చిన రోగులో 80 మందికి కంటి శుక్ల పరీక్షలు చేయగా, వీరిలో 40 మందికి నేత్ర శస్త్రచికిత్సలు అవసరమున్నట్టు గుర్తించామన్నారు. అత్యవసరంగా వీరిలో 14 మందిని ప్రత్యేక వాహనంలో విజయనగరం వెంకటేశ్వర పుష్పగిరి ఆస్పత్రికి తరలించామన్నారు. నేత్ర సంబంధిత సమస్యలు ఉంటే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం వయస్సులో ప్రమేయం లేకుండా చేత్ర సమస్యలు వస్తుందన్నారు.తక్కువగా నేత్ర వైద్య నిపుణులు, స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో రోగులకు పరీక్షిస్తున్న నేత్ర వైద్య నిపుణులు

రహదారి పనులకు శంకుస్థాపన

ముంచంగిపుట్టు: సుదీర్ఘ పోరాటాలతో పలు రహదారులకు మోక్షం కలిగిందని సర్పంచ్ మట్టం బంగారమ్మ అన్నారు. మండలంలోని బాబుశాల పంచాయతీ కేంద్రం నుంచి సిరగంపుట్టు, జడిగూడ, బోండాపుట్టు గ్రామాలను కలుపుకొని ఉపాధి హామీ పథకం నిధులు రూ.7కోట్లతో నూతన రహదారుల పనులకు సోమవారం సర్పంచ్ బంగారమ్మ శంకుస్థాపన చేశారు. చాలా ఏళ్లుగా రహదారి సమస్యతో ఇబ్బందులు పడిన గిరిజనులు నూతన రహదారి మంజూరులో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బంగారమ్మ మాట్లాడుతూ శరవేగంగా పనులు చేసి రహదారి నిర్మాణం పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో రాజీ లేకుండా పనులు చేయాలని కాంట్రాక్టర్ వారు సూచించారు. రహదారులు పూర్తయితే రవాణా కష్టాలు తీరుతాయని ఆయన అన్నారు. వైఎస్సార్‌సీపీ నేత మట్టం రాజేంద్ర ప్రసాద్‌మినుముల అప్పారావు, ఉపసర్పంచ్ గణపతి,వార్డు మెంబర్లు విజయ్‌కుమార్,పితంబరం, పలు గ్రామాల గిరిజనులు పాల్గోన్నారు.



సిరగంపుట్టు రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ మట్టం బంగారమ్మ, నేతలు

నష్ట పరిహారం చెల్లించాలి



వర్షాలకు కూలిన ఇంటి గోడ వద్ద బాధిత కుటుంబం



స్థానికులతో మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత పాలికి లక్కు

పాడేరు రూరల్: మండలంలోని వంట్లమామిడి పంచాయతీ నండిగరువు గ్రామంలో గిరిజన సంఘం నేత పాలికి లక్కు సోమవారం పర్యటించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామస్తుడు పాంగి జోగికి చెందిన జన్‌మన్ పథకం ఇంటి గోడ సగ భాగం కూలిపోయినట్టు తెలుసుకున్నారు. గ్రామాల్లో నిర్మిస్తున్న జన్‌మన్ పథకం ఇళ్లు కూలిపోవడం దారుణమన్నారు. అప్పులు చేసి నిర్మించుకున్న ఇళ్లు దెబ్బతింటుండంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. ప్రభుత్వం స్పందించి పరిహారం వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లపై సర్వే చేసి లబ్ధిదారులకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. మారుమూల పంచాయతీల్లో మరింత నష్టాలు ఉంటాయని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

వాల్యుయేషన్ సక్రమంగా చేయాలని డిమాండ్

వి.ఆర్.పురం: ప్రతి ఇంటికి అధికారులు వేసే వాల్యుయేషన్‌తో నిర్వాసితులు ఆందోళన చేందుతున్నారని చిన్నమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, పీసా కమిటీ అధ్యక్షుడు కోటం జయరాజు చెప్పారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఇంటి వాల్యుయేషన్ సక్రమంగా చేయడం లేదన్నారు. దీంతో నిర్వాసితుల్లో ఆందోళన నెలకొందన్నారు. అధికారులు చేపడుతున్న వాల్యుమేషన్ వివరాలను తెలియజేయాలని గ్రామస్తులు కోరుతున్నారని వారు చెప్పారు.



మాట్లాడుతున్న సర్పంచ్ రామారావు, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు జయరాజు

సేంద్రియ సాగుతో లాభాలు



మాట్లాడుతున్న సీసీఎస్ పీవో నాగమణి, కో–ఆర్డినేటర్ గాసినాయుడు

డుంబ్రిగుడ: సంపూర్ణ సేంద్రియ పద్ధతిలో పంటల సాగుకు ఊతమిస్తే భావితరాలకు భరోసాగా ఉంటుందని సీపీఎఫ్ సంస్థ ప్రాజెక్టు అధికారి నాగమణి అన్నారు. మండలంలోని లైగండలో ద్రవ జీవామృతం యూనిట్‌ని సర్పంచ్ శాంతి సమక్షంలో ప్రారంభించారు. సేంద్రియ సాగుతో భూములను సారవంతం చేసుకుని పంటల సాగు చేయాలని సూచించారు. కో–ఆర్డినేటర్ గాసినాయుడు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడమే కాకుండా భూములు సారవంతంగా మారుతాయన్నారు. రైతు సాధికార సంస్థ యూనిట్ ఇన్‌చార్జి పోలన్న, చంద్రదాసు, గిరిజన రైతులు పాల్గొన్నారు.